సాక్షి చిత్తూరు

బుధవారం । 29 । మే । 2024



'దివ్య'మైన భవిత

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్చి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. - 8లో



పవిత్రం.. అగ్నిగుండ ప్రవేశం

గుడుపల్లె మండలం యామగానిపల్లెలో ధర్మరాజస్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. - 8లో



మాక్‌డ్రిల్

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మంగళవారం చిత్తూరులో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

ఏజెంట్ల సమక్షంలోనే ఓట్ల లెక్కింపు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4వ తేదీన ఆయా పార్టీల అభ్యర్థులతోపాటు ఏజెంట్ల సమక్షంలోనే ఓట్ల లెక్కింపు సాగుతుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 3 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజు ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, ఏజెంట్లు కేంద్రానికి రావాలని స్పష్టం చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. కంట్రోల్ యూనిట్‌లో ఓట్ల లెక్కింపునకు సంబంధించి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను రెండు సార్లు తెలియజేయడంతో పాటు డిస్‌ప్లే బోర్డులో ప్రచురించడం జరుగుతుందన్నారు. ఏజెంట్లు ఫారమ్–18 రెండు సెట్లను జూన్ 1వ తేదీన ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేస్తే, గుర్తింపు కార్డులు అందిస్తామని వివరించారు. ఓట్ల లెక్కింపునకు వచ్చేటప్పుడు ఏజెంట్లు ఫారమ్–18తో పాటు గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.సమావేశంలో చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, రూరల్ తహసీల్దార్ షేక్ హసీనాబీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, రాజసింహులు, రమణారెడ్డి పాల్గొన్నారు.

జ్యూస్ ఉత్పత్తితో రైతుకు గిట్టుబాటు ధర



వివిధ దేశాల ప్రతినిధులతో గోవర్ధన్‌బాబీ

చిత్తూరు అగ్రికల్చర్: నేచురల్ జ్యూస్ ఉత్పతితో రైతులకు గిట్టుబాటు ధర కల్పించవచ్చని జిల్లా పండ్ల పరిశ్రమల అసోసియేషన్ కార్యదర్శి గోవర్ధనబాబీ తెలిపారు. మంగళవారం బెంగళూరులో ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసర్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ ఫ్రూట్ అండ్ వెజిటేబుల్ జ్యూసెస్ అసోసియేషన్ లండన్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ దేశాల ప్రతినిధులతో గోవర్ధన్‌బాబీ మాట్లాడారు. రైతులకు పండ్ల ఉత్పత్తిలో గిట్టుబాటు ధర కల్పించేందుకు పండ్ల పరిశ్రమలు కృషి చేయాలని కోరారు. నేచురల్ జ్యూస్ ఎక్కువ ఉత్పత్తి చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. సెమినార్‌లో జిల్లా పండ్ల పరిశ్రమల అసోసియేషన్ సభ్యులు తలపులపల్లి బాబురెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

కుప్పం : కుప్పం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ నాగేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు నెలలుగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న సంతోష్‌కు ముందుగా షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై ఆయన స్పందిచకపోవడంతోపాటు మద్యం సేవించి విధులకు హాజరుకావడం, పారిశుద్ధ్య సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంపై చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జూన్‌లో కొత్త 'ఎస్‌పీఎం' ప్రారంభం



ఎస్‌పీఎం తనిఖీ చేస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం (ఎస్‌పీఎం)ను జూన్ మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం చిత్తూరులోని ఎస్‌పీఎంను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మరమ్మతు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులుంటే 1912 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రూ.1.5 కోట్ల వ్యయంతో కొత్త ఎస్‌పీఎం నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈలు జయప్రకాష్, ఆనంద్, శేషాద్రి, ఏఈ మోహన్‌శెట్టి పాల్గొన్నారు.

నాడు విధ్వంసం.. నేడు అజ్ఞాతవాసం

వ్యక్తులపై జరగని దాడిని జరిగినట్టు నమ్మించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. రెచ్చగొట్టేలా దాడులకు ప్రేరేపించే నటనలతో మనసుల్లో విషం నింపారు. చంద్రగిరి రౌడీ మూకలతో చిత్తూరు, తిరుపతి రౌడీలు జతకలిశారు. కన్నూమిన్నూ కానకుండా రెచ్చిపోయారు. గుండాలు, రౌడీ బ్యాచ్ తిరుపతిలో మారణాయుధాలు, కర్రలు, రాడ్లతో బీభత్సం సృష్టించారు. అమాయకులు, ప్రయాణికులు, వర్సిటీ ఉద్యోగులపై దాడులకు పాల్పడ్డారు. తలలు పగులగొట్టి.. కాళ్లు, చేతులు విరిచేశారు. ఈ భయానక ఘటనలకు సంబంధించిన ఆధారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అరాచకశక్తులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. నమోదైన కేసులను బట్టి చూస్తే విధ్వంసకారులకు పదేళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో అరెస్టులకు భయపడి అరాచక మూకలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాయి.



మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూం సమీపంలో కారును ధ్వంసం చేసిన అల్లరిమూకలు (ఫైల్)

నిందితులకు పడే శిక్షలు ఇవే

సెక్షన్ 307	హత్యాయత్నం. బాధితుడికి తీవ్రగాయం అయితే జీవిత ఖైదు పడే అవకాశం. లేదా పదేళ్ల జైలు, జరిమానా రెండూ విధించవచ్చు.
సెక్షన్ 147	అల్లర్లకు పాల్పడినందుకు, రెండేళ్ల వరకు జైలు, లేదా జరిమానా..
సెక్షన్ 148	మారణాయుధాలతో అల్లర్లకు పాల్పడడం, మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా
సెక్షన్ 120బీ	నేరపూర్వక కుట్రకు పాల్పడడం, ప్రధాన నిందితుడికి పడిన శిక్షతో సమానంగా నేర ఘటనల్లో భాగస్వామి అయ్యి ప్రజా ప్రశాంతతకు వ్యతిరేకంగా నేరాలకు పడే శిక్ష పడుతుంది. రెండేళ్ల నుంచి జీవిత ఖైదు పడే అవకాశం.
సెక్షన్ 323	పదునైన వస్తువుతో గాయపరచడం, ఏడాది జైలు, జరిమానా పడే అవకాశం
సెక్షన్ 324	ప్రమాదకరమైన ఆయుధాలు ద్వారా గాయపరచడం, మూడేళ్ల వరకు జైలు, జరిమానా పడే అవకాశం
సెక్షన్ 506 రెడ్‌విత్	నేరపూరిత బెదిరింపులు, తీవ్ర గాయానికి కారణమైతే... రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు
సెక్షన్ 149	గుంపుగా అల్లర్లకు పాల్పడడం, ఏడాది వరకు జైలు

హత్యాయత్నం కేసుతో బిగుస్తున్న రౌడీషీట్ ఉచ్చు!

- 37 మంది నిందితులపై ఇప్పటికే హత్యాయత్నం కేసులు
- బయటకు వస్తున్న అరాచకాల వీడియోలు, ఆడియోలు
- నాన్–బెయిలబుల్ కేసులతో 10 ఏళ్లు శిక్ష పడే అవకాశం
- అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి నిందితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎన్నికల సందర్భంగా చంద్రగిరి, తిరుపతి రూరల్‌లో బీభత్సం సృష్టించి కేసుల్లో ఇరుక్కున్న అల్లరిమూకలు అరెస్టులకు భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నాటి ఘర్షణల్లో పాల్గొన్న 37 మందిపై తాజాగా పోలీసులు కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో నాడు గాయపడిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తమపై మారణాయుధాలతో దాడులు చేసిన విధానం, అందులో తాము రక్తగాయాలు పాలుకావడం, భయంతో బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు పారిపోవడం, అక్కడ వైద్యం చేయించుకోవడం, ఎమ్మెల్సీ సర్టిఫికెట్ తీసుకుని, వీడియో ఆధారాలతో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు అప్పటి వీడియోలు, ఆడియోల ఆధారంగా మరికొందరిపై హత్యాయత్నం కేసులు నమోదుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఆ 37 మందిపై రౌడీషీట్

పోలింగ్ తర్వాత రోజు మహిళా వర్సిటీ వద్ద జరిగిన బీభత్సం తాలుక ఘటనల్లో పలువురి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో ముమ్మర దర్యాప్తు చేపట్టారు. రాడ్లు, మారణాయుధలతో దాడులు చేయడం, దాడులు చేస్తున్న వారిని ప్రోత్సహించడం, స్వయంగా దాడుల్లో పాల్గొన్నారనే కారణాలతో 37 మందిపై వర్సిటీ పోలీసులు కేసులు నమోదు చేశారు. హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, ప్రమాదకర ఆయుధాలతో దాడి, బాధితులను బెదిరించడం, మూకుమ్మడిగా అల్లర్లకు పాల్పడడం, తీవ్రమైన గాయాలు చేయడం.. వంటి కారణాలతో మొత్తం 8 సెక్షన్లపై కేసులు నమోదు చేశారు. కనీసం 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్న సెక్షన్లు కావడంతో కేసు తీవ్రత ఎక్కువగా ఉంది. కేసు నమోదైన 37 మందిపై రౌడీషీట్ తెరిచే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం నమోదైన హత్యాయత్నం కేసులో ఉన్న వారిలో చాలామందిపై గతంలోనే పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయి. గతంలోనూ హత్యాయత్నం కేసులు ఉన్న వారు కూడా ఇందులో ఉన్నారు. వారి పూర్వ నేర చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకుని అలాంటి వారిపై పీడీ యాక్టు కూడా నమోదు చేసే అవకాశం ఉంది.

చిత్తూరులో గాలింపు చర్యలు



దగ్ధమవుతున్న మోహిత్‌రెడ్డి కారు (ఫైల్)

చిత్తూరు నుంచి అనేకమంది చంద్రగిరికి వచ్చి దాడుల్లో పాల్గొన్నారు. రాడ్లు, మారణాయుధాలతో ఇష్టారాజ్యంగా అమాయకులను రక్తగాయాల పాలు చేసినట్లు వీడియోల్లో నమోదైంది. ఇప్పటికే వారి పేర్లు, చిరునామాలు గుర్తించారు. కేసుల నమోదుతో వీడియోలో ఉండి దాడుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందం ఇప్పటికే చిత్తూరులో మకాం వేసింది. ముమ్మర గాలింపు చర్యలు చేపడుతోంది. వర్సిటీ ఘటనలతో పాటు కూచువారిపల్లి దాడుల్లోనూ చిత్తూరు మూక హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

నాన్–బెయిలబుల్ కేసులు... పరారీలో నిందితులు

కన్నూమిన్నూ కానకుండా విధ్వంసం సృష్టించి, మారణాయుధాలతో దాడులకు తెగబడిన రౌడీ గ్యాంగ్‌పై పలు సెక్షన్ల కింద 37 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో నాన్–బెయిలబుల్ సెక్షన్లు సైతం ఉండడం, పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉండడం, స్టేషన్ బెయిల్ కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు సమాచారం. ఎన్నికల తర్వాత జరిగిన ఘటనల్లో నమోదైన కేసులపై ఎన్నికల సంఘం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం, పోలీసు అధికారులు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నిందితులను అరెస్ట్ చేసేందుకు వర్సిటీ పోలీసులు ముమ్మర యత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కేసులో ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. పోలీసులు వస్తున్నారని తెలిసి నిందితులు పరారయ్యారు. నిందితుల ఫోన్ లోకేషన్ ద్వారా అయినా అరెస్ట్ చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కేసులో ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తామని, ఎవ్వరినీ వదలమని ఇప్పటికే తిరుపతి జిల్లా ఎస్పీ ప్రకటించారు.



మొదలియార్ రమేష్‌పై దాడి చేస్తున్న గూండాలు (ఫైల్)



మహిళావర్సిటీ వద్ద రోడ్డుపై బీభత్సం సృష్టిస్తున్న అల్లరి మూకలు (ఫైల్)

గాయపడి.. భయపడి.. పారిపోయి సర్జరీలు చేసుకొచ్చి ఫిర్యాదు

వర్సిటీ ముందు జరిగిన ఘర్షణలో మారణాయుధాలు, కర్రలు, రాడ్లతో దాడులు చేయడం వల్ల పెద్ద సంఖ్యలో అమాయకులకు తీవ్రంగా రక్తగాయాలయ్యాయి. మరికొందరికి కంటి చూపు దెబ్బతింది. ఇంకొందరికి అత్యవసరంగా సర్జరీలు చేసుకోవాల్సి వచ్చింది. నాటి దాడుల్లో గాయపడిన కొందరు భయంతో రక్తగాయాలతోనే బెంగళూరు, చెన్నై నగరాలకు పారిపోయారు. అక్కడే అత్యవసర చికిత్సను తీసుకుని ప్రాణాలను కాపాడుకున్నారు. తాజాగా పోలీసులు నాటి ఘర్షణల్లో పాల్గొన్న 37 మందిపై కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేయడంతో బాధితులు ధైర్యం తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్సీ సర్టిఫికెట్లు, నాడు తమకు తగిలిన రక్తగాయాలకు సంబంధించిన సర్జరీలు, డాక్టర్ల రిపోర్టులతో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అందులో భాగంగానే వర్సిటీ వద్ద తనపై దాడికి సంబంధించిన వీడియో ఆధారాలతో కొటాలకు చెందిన విరుపాక్ష హేమంత్ తిరుపతి ఎస్పీని ఆశ్రయించాడు. మారణాయుధాలతో దాడి చేయడం వల్ల తన కంటికి తీవ్ర గాయం కావడం, 11 కుట్లు వేయాల్సి రావడం, అందుకు సంబంధించిన వైద్య నివేదికలను పోలీసులకు అందించాడు.

కుప్పంలో బాబు ఓటమి తథ్యం



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : కుప్పంలో చంద్రబాబు ఓడిపోవడం తథ్యమని ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. చీఫ్ సెక్రటరి కేఎస్ జవహర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ డిమాండ్ చేయడంపై మండిపడ్డారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. రవీంద్ర డిమాండ్‌కు మద్దతుగా టీడీపీ నేత బొండా ఉమా మాట్లాడడం, ఎల్లోమీడియా వంత పాడుతూ కథనాలు ప్రచురించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్‌రెడ్డిని తప్పించి నిమ్మగడ్డ రమేష్‌ను చీఫ్ సెక్రటరీ చేయాలా అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి అండతో ఎలక్షన్ కమిషన్ తమ చెప్పుచేతల్లో ఉందని టీడీపీ నాయకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. వారు విమర్శించిన అధికారులందరినీ ఈసీ సస్పెండ్ చేస్తుందనే భ్రమలో ఉన్నారని విమర్శించారు. జూన్ 4వ తేదీన వైఎస్సార్‌సీపీ అఖండ విజయం ఖాయమని వెల్లడించారు. జిల్లాలో సైతం క్లీన్‌స్వీప్ చేయనున్నట్లు తెలిపారు. కుప్పంలో చంద్రబాబు 10వేల ఓట్ల తేడాతో ఓడిపోనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ప్రమాణస్వీకారం చేయనున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు చిలకపలుకులు వల్లిస్తున్న బొండా ఉమా గతంలో కాల్‌మనీ పేరిట మహిళలను వేధించిన దుర్మార్గుడని ఆరోపించారు. ఎల్లోమీడియా కావాలని ఇష్టారాజ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులపై కథనాలు ప్రచురిస్తోందని, ఇది సరి కాదని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలతో అధికారంలోకి రావడం తథ్యమని వెల్లడించారు. జూన్ 4వ తేదీన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్న తేదీని ప్రకటించనున్నట్లు వివరించారు. చంద్రబాబు ఇక జీవితంతో ముఖ్యమంత్రి కాలేరని, ఆయన జాతకంలో అదే రాసిపెట్టి ఉందని స్పష్టం చేశారు.

పకడ్బందీగా ఆన్‌లైన్ మూల్యాంకనం



సయ్యద్‌మౌలా, డీవీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రక్రియను అధ్యాపకులు పకడ్బందీగా నిర్వర్తించాలని డీవీఈఓ సయ్యద్ మౌలా ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు చరిత్రలో తొలిసారిగా ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర అధికారులు రెండు విడతలుగా అధ్యాపకులకు వర్చువల్ శిక్షణ ఇచ్చారని తెలిపారు. మూల్యాంకనం విధులు కేటాయించిన అధ్యాపకులు తప్పనిసరిగా హాజరయ్యేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు హాజరయ్యేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలదేనని చెప్పారు. ప్రైవేట్ అధ్యాపకులు గైర్హాజరైతే కళాశాల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. సెల్‌ఫోన్, ట్యాబ్‌లో జవాబు పత్రాలు ఓపెన్ కావన్నారు. ఇంటర్‌నెట్ సెంటర్లలో వ్యాల్యూయేషన్ చేయకూడదని స్పష్టం చేశారు. వ్యక్తిగత ల్యాప్‌ట్యాప్, కళాశాలల్లో వెబ్ కెమెరా సదుపాయం ఉన్న డెస్క్‌టాప్ కంప్యూటర్‌లో మాత్రమే జవాబు పత్రాలను ఓపెన్ చేసుకోవాలని సూచించారు. మూల్యాంకన సమయంలో సంబంధిత అధ్యాపకుడు తప్ప ఇతరులెవ్వరూ కనిపించకూడదన్నారు. ఆ సమయంలో ఫొటోలు తీయకూడదని, వీడియో రికార్డ్ చేయకూడదని కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్రమత్తంగా కౌంటింగ్ విధులు





మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్, శిక్షణకు హాజరైన అధికారులు, సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : కౌంటింగ్ విధులను అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. జూన్ 4వ తేదీన ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగుతుందని వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు కేటాయించిన ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటింగ్ రోజున విధులకు గైర్హాజరు కాకూడదని తెలిపారు. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం అందించిన మాడ్యూల్‌ను తప్పనిసరిగా చదవాలన్నారు. కౌంటింగ్ హాల్ లోకి ఫోన్‌లను అనుమతించమని చెప్పారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. సిబ్బందికి మరోసారి జూన్ 3వ తేదీన అబ్జర్వర్ల సమక్షంలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. 4వ తేదీన అబ్జర్వర్ల సమక్షంలో ర్యాండమైజేషన్ చేసిన అనంతరం కౌంటింగ్ విధులను కేటాయిస్తామని వివరించారు.

ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 టేబుళ్లు

ఓట్ల లెక్కింపు నిమిత్తం ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు. ఆయా నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల సంఖ్యను బట్టి 17 నుంచి 21 రౌండ్ల వరకు కౌంటింగ్ ఉంటుందన్నారు. ప్రతి టేబుల్‌కు పర్యవేక్షకులు, సహాయకులు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని వివరించారు. ఓట్ల లెక్కింపు నిమిత్తం 318 మంది పర్యవేక్షకులు, 383 మంది సహాయకులు, 360 మంది సూక్ష్మ పరిశీలకులు, రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 1,088 మందిని నియమించినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో ఏఆర్‌ఓలు ఉంటారని వెల్లడించారు. అనధికారిక వ్యక్తులను కౌంటింగ్ కేంద్రంలోని అనుమతించమని స్పష్టం చేశారు. విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డు ధరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే బెల్ ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం తాజా ఆదేశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఏజెంట్లకు ఎలాంటి సందేహాలు వచ్చినా ఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని కోరారు. పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వీఆర్ చంద్రమౌళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు, ఇతర నియోజకవర్గాల ఆర్‌ఓలు పుల్లయ్య, మధుసూదన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, వెంకటశివ, ట్రైనీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఫిర్యాదులపై విచారణ

కాణిపాకం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టులను అక్రమంగా భర్తీ చేశారంటూ వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం కడప రీజినల్ డైరెక్టర్ రత్నకుమారి విచారణ చేపట్టారు. 2019లో పలు పోస్టుల భర్తీ, ఇష్టానుసారంగా బదిలీలు చేశారని..అప్పటి డీఎంహెచ్‌ఓ పెంచులయ్య, జిల్లా క్షయ నివారణ అధికారి రమేష్‌బాబు, ఏఓలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై రాష్ట్ర శాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. ఈమేరకు రత్నకుమారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుల్లోని అంశాలను క్షుణంగా పరిశీలించి అధికారులను లోతుగా విచారించారు. పూర్తి స్థాయిలో వివరాలు సేకరించారు. దీనిపై సమగ్రంగా నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు రత్నకుమారి వెల్లడించారు.

జిల్లాకు ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా అవసరాల నిమిత్తం 25 కేవీ సామర్థ్యం గల 100 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు చిత్తూరుకు చేరినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి మెటీరియల్ డ్రా చేసి పంపిణీ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

కాటేసిన పామును చంపి.. తనువు చాలించాడు!


మృతి చెందిన మునికృష్ణ

బంగారుపాళెం : కాటేసిన పామును ఓ వ్యక్తి చంపి, అనంతరం ప్రాణాలు వదిలిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. కేజీ సత్రం గ్రామానికి చెందిన మునికృష్ణ(56) స్థానికంగా మటన్ కొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన ఇంటి ముందు అరుగుపై నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే నిద్ర లేచిన మునికృష్ణ తనను కరచిన పామును చంపేశాడు. కుటుంబీకులను సైతం నిద్రలేపి పాము కాటేసిన విషయం చెప్పాడు. దీంతో వారు హుటాహుటిన మునికృష్ణను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడిపాల : మండలంలోని చిత్తపార గ్రామంలో రెండు రోజుల క్రితం నందిని అనే యువతిపై దాడి చేసి గాయపరచిన కేసులో నిందితుడు విజయ్(24)ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. భూమి విషయంలో తలెత్తిన వివాదంలో విజయ్ విచక్షణారహితంగా నందినిని చితకబాదాడు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందిన బాధితురాలు ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెస్ట్ సీఐ శివశంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

'పచ్చ'నేత కబ్జాలో ప్రభుత్వ స్థలం


ఆక్రమిత స్థలంలో నిర్మించిన షెడ్డు

చౌడేపల్లె : మండలంలోని కాటిపేరి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని టీడీపీ స్థానిక నేత సుబ్రమణ్యంరెడ్డి దర్జాగా కబ్జా చేశాడు. వివరాలు.. సర్వే నంబర్ 178/1లోని సుమారు 45 సెంట్లను సదరు టీడీపీ నేత ఆక్రమించుకుని పశువుల కోసం షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. రూ.లక్షల విలువైన స్థలం కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీఆర్ఓ వేణుని వివరణ కోరగా.. ఆక్రమణపై ఫిర్యాదు అందిందని తెలిపారు. కబ్జా చేసిన స్థలంలో షెడ్డు తొలగించాలని ఆదేశించామన్నారు.

'దివ్య'మైన భవిత

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఇంటికే పరిమితం కాకుండా మానసికంగా..శారీరకంగా మిగిలిన వారితో సమానంగా ఎదిగేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఇలాంటి పిల్లలకు దివ్యమైన భవితను అందించేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో కృషి చేస్తోంది. ఈ క్రమంలో ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రం ఏర్పాటు చేసి సహిత విద్యను ప్రవేశపెట్టింది. ఈ మేరకు భవిత కేంద్రాల్లో అడ్మిషన్ల పెంపునకు సర్వే చేపట్టింది. ఐఈఆర్పీల ద్వారా గడప గడపకు వెళ్లి వివరాలు సేకరిస్తోంది.

- జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్పీలు
- సహకారం అందిస్తున్న ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు,
- ఇప్పటి వరకు 351 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి


క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్పీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 31 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన 672 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో అవసరమైన వారికి వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ ఇప్పిస్తున్నారు. అలాగే జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించడానికి భవిత కేంద్రాల ఐఈఆర్పీ (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. సమగ్ర శిక్ష ద్వారా బుద్ధి మాంద్యం పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే వారికి అవసరమై పరికరాలను సైతం అందజేస్తున్నారు. ఈ మేరకు జూన్ 9వ తేదీ వరకు సర్వేను కొనసాగించనున్నారు.

సర్వే లక్ష్యం ఇదే..

దివ్యాంగులు, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలను గుర్తించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంల సాయంతో ఐఈఆర్పీలు సర్వే చేస్తున్నారు. దివ్యాంగ చిన్నారులందరికీ అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారినీ వారి వయస్సుకు తగిన పాఠశాలలో చేర్పించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నారు. సర్వేలో భాగంగా ఇలాంటి పిల్లలు ఇంకా ఉంటే గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి, పాఠశాలలకు రప్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా సమాచారం	
భవిత కేంద్రాలు	31
ఐఈఆర్పీలు	62
ప్రత్యేక అవసరాలున్న పిల్లలు	672
కొత్తగా నమోదైన వారు	351

ప్రత్యేకంగా అలవెన్సులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు నాలుగు రకాల అలవెన్సులను ప్రభుత్వం అందిస్తోంది. వీటిలో బడికి వచ్చే మానసిక, బుద్ధిమాంద్యం ఉన్న వారికి, ఇంటి వద్దే ఉంటున్న వారికి, ఆడపిల్లలకు అలవెన్సులు ఇస్తున్నారు. బడికి వచ్చే వారికి రీడర్ అలవెన్సు కింద రూ.300 చొప్పున పది నెలలకు రూ.3వేలు, ఆడపిల్లలకు ప్రత్యేకంగా గర్ల్స్ చైల్డ్ అలవెన్సు కింద రూ.200చొప్పున పది నెలలకు రూ.2వేలు ఇస్తున్నారు. హోమ్ బేస్డ్ అలవెన్సు కింద ఇంటి వద్దే ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి మాత్రమే రూ.300 చొప్పున పది నెలలకు రూ.3వేలు ఇస్తున్నారు. బడికి వెళ్లే వారికి పాఠశాలలో అందరి విద్యార్థులతో పాటు వీరికి యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, షూ, టై అందజేయడంతో పాటు వీరికి అమ్మ ఒడి పథకం వర్తింపజేస్తున్నారు. అలాగే ట్యాబ్‌లు సైతం అందిస్తున్నారు.

పక్కాగా పర్యవేక్షణ



జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నాం. ఐఈఆర్పీలు ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించే పనిలో ఉన్నారు. భవిత కేంద్రాలను ప్రభుత్వం బలోపేతం చేసింది. ఇక్కడ చదివే విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఉపకరణాలను పంపిణీ చేస్తున్నాం. విభిన్నప్రతిభావంతులైన పిల్లలను తల్లిదండ్రులు భవిత కేంద్రాలకు పంపించాలి.

– పెద్దిరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఏపీసీ, జిల్లా సమగ్రశిక్ష శాఖ

వందశాతం పూర్తి చేసేలా..



పకడ్బందీగా సర్వే సాగుతోంది. వందశాతం పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటి వరకు 351 మంది విద్యార్థులను కొత్తగా గుర్తించాం. భవిత కేంద్రాల్లో అర్హులైన ఐఈఆర్పీలు ఉన్నారు. బడి ఈడు పిల్లలను చైతన్య పరచి భవిత కేంద్రాలకు రప్పించేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా క్యాంపులు నిర్వహించి భవిత కేంద్రాల్లో చదివే విద్యార్థులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేస్తున్నాం. అలవెన్సులను ఎప్పటికప్పుడు అందిస్తున్నాం.

– ప్రభాకర్‌వర్మ, కో–ఆర్డినేటర్, జిల్లా సమగ్రశిక్ష శాఖ

తల్లీబిడ్డ అదృశ్యంపై ఫిర్యాదు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు కొత్తకాలనీకి చెందిన ఓ తల్లీబిడ్డ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. కాలనీలో నివసిస్తున్న పల్లవి(20) తన కుమార్తె జ్యోతిసూర్య (3) కనిపించడం లేదని మంగళవారం ఆమె తమ్ముడు సురేష్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ విశ్వనాథ్ తెలిపారు. ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

గంగాధర నెల్లూరు : మండలంలోని జంగాలపల్లె వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. వేట్కూరుపల్లె గ్రామానికి చెందిన చిట్టిబాబు(48) స్కూటర్‌పై జీడీ నెల్లూరులో నిర్వహిస్తున్న సంతకు వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో చిట్టిబాబు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్రం.. అగ్నిగుండ ప్రవేశం


దుర్యోధనుని వధ తిలకించేందుకు విచ్చేసిన జనం


అగ్నిగుండం వద్దకు తరలివచ్చిన ద్రౌపదీదేవి


దుర్యోధనుని ప్రతిమ వద్ద భీముడు, దుర్యోధన వేషధారుల ప్రదర్శన

గుడుపల్లె : మండలంలోని యామగానిపల్లెలో వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు సాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఈ క్రమంలో తొలుత అమ్మవారికి నిప్పులతో వడిబాల కట్టారు. పచ్చిగెరిగెను అగ్నిగుండంలోకి తీసుకెళ్లారు. అనంతరం ఉప్పువేసి పెద్దసంఖ్యలో భక్తులు కంకణధారులై నిప్పుల గుండంలోకి ప్రవేశించారు.

అలరించిన వధ


ఆలయం సమీపంలోని గుడి సత్రం వద్ద ప్రదర్శించిన దుర్యోధన వధ అలరించింది. ఈ క్రమంలో దుర్యోధనుని ప్రతిమను ఏర్పాటు చేశారు. అక్కడ పాండవులు, ద్రౌపది విగ్రహాలను ఉంచారు. అనంతరం దుర్యోధనుడు భీముడు, ద్రౌపది వేషధారులు అద్భుతంగా వధ ఘట్టాన్ని రక్తి కట్టించారు. వేలాది మంది కార్యక్రమాన్ని వీక్షించి కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతికం

ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహాభారత ఘట్టాలతో చేపట్టిన నాటక ప్రదర్శనలు అలరించాయి. ఈ క్రమంలో బుధవారం ఆలయ ఆవరణలో ధర్మరాజస్వామి పట్టాభిషేకం చేపట్టనున్నారు. భక్తులు పొంగళ్లు పొంగించి సమర్పించనున్నారు.

• వింత.. పులకింత


వింతను చూస్తున్న భక్తులు


నీటితొట్టెలో దేవత ఆకారం

నగరి పట్టణం కీళపట్టులోని త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ఆధ్యాత్మిక వింత చోటుచేసుకుంది. నూతనంగా ప్రతిష్ఠించనున్న ఓందేవి, శరభేశ్వరర్ విగ్రహాలను ఉంచి జలావాసంలో అద్భుతం ఆవిష్కృతమైంది. పవిత్ర ప్రతిమలను ఉంచిన నీటి తొట్టిలో చల్లిన కుంకుమ, పుష్పాలు దేవతామూర్తి దర్శనమిచ్చింది. ఈ అపురూప దృశ్యాన్ని వీక్షించిన భక్తుల మనసు ఆనందంతో పులకించింది.

– నగరి

శాస్త్రోక్తంగా అంకురార్పణ

నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

కార్వేటినగరం : వేణుగోపాలస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రిశాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవర్లకు అభిషేకం, తోమాల సేవ, సహస్రనామార్చన జరిపించారు. సాయంత్రం సంప్రదాయబద్ధంగా శాత్తుమొర చేపట్టారు. ఈ క్రమంలోనే సేనాపతి ఉత్సవం చేశారు. రాత్రి 7.15 గంటలకు అంకురార్పణతో సకల దేవతలకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో టీటీడీ ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయాధికారి సురేష్‌కుమార్, షరాబ్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

స్వామివారికి సారె సమర్పణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి కార్వేటినగరానికి చెందిన సుబ్రమణ్యాయాదవ్ సారె సమర్పించారు. ధ్వజారోహణానికి అవసరమైన గరుడ పతాకం, కొడితాడు, గరుడ ధ్వజం, పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకువచ్చి అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో మేధినీదేవి

విశేష సేవలు

వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల నడుమ ధ్వజారోహణం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలునికి ఊంజల్ సేవ జరిపించనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

• మాక్ డ్రిల్

"కౌంటింగ్ రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.. అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తాం.. అల్లరి మూకలను అడ్డుకుంటాం.. ఎక్కడైనా ఘర్షణల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి తరలిస్తాం.. ప్రశాంతవాతావరణంలో జనజీవనం సాగేలా కృషి చేస్తాం" అంటూ ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసుల దళం కదం తొక్కింది. మంగళవారం సాయంత్రం 4 30 గంటలకు చిత్తూరు నగరంల్లో మాక్ డ్రిల్ నిర్వహించింది. క్లిష్ట పరిస్థితుల్లో చేపట్టే చర్యలను ప్రదర్శించింది.

– చిత్తూరు అర్బన్







